జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్

మంగళవారం 11, జూన్ 2024

మా అందరి ఆప్తులు ... మా శ్రేయోభిలాషి ..మహానాడు మీడియా అధిపతి

గౌరవనీయులు బోడేపూడి వెంకట సుబ్బారావు (BSR) గారికి

మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...మీ మహానాడు టీం

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, జూన్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

జగన్‌పై తిరుగుబాటు!

- ముగ్గురు ఎంపి, ఐదుగురు ఎమ్మెల్యేలు జంప్?
- బీజేపీలోకి ఐదుగురు ఎమ్మెల్యేలు?
- అదే దారిలో రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, అరకు ఎంపి తనూజారాణి? ● కడప ఎంపి అవినాష్ దారెటు?
- 'అన్న' జగన్ కోసం పదవిని త్యాగం చేస్తారా?
- అరెస్టు కాకుండా 'కమల'వనంలో చేరతారా?
- ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో అవినాష్ ● లోక్‌సభకు పోటీచేసే యోచనలో జగన్?
- పులివెందులలో భారతీని పోటీ చేయించే వ్యూహం
- బీజేపీ వైపు బాలినేని చూపు? ● 'ఫ్యాను'కు ముచ్చెమటలు

(మార్తి సుబ్రహ్మణ్యం)

వైసీపీ అధినేత జగన్‌కు సినిమా కష్టాలు మొదలయ్యాయి. ఓడిపోతే పరిణామాలు ఎంత చేదుగా-దారుణంగా ఉంటాయో, జగన్ అనుభవంలో అర్థం చేసుకుంటున్నారు. 151 మెజారిటీ చూసుకుని మిడిసిపడ్డ జగన్.. ప్రజాప్రతినిధులను పురుగుల్లా చూశారు. ఇపుడు 11 మందికి నాయకుడిగా మిగిలిపోయిన తర్వాత, విధేయత ఎంత విచిత్రంగా మారుతుందో తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా తానే తిరుగుబాటును, ఎదుర్కొనే విషాద పరిస్థితి కొని తెచ్చుకుంటున్నారు.

మాజీ సీఎం జగన్‌పై వైసీపీ ప్రజాప్రతినిధులు తిరుగు బాటు బావుటా ఎగురవేసేందుకు సిద్ధమవుతున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు బీజేపీలో చే రేందుకు రెడీ అవుతున్నారన్న వార్తలు, 'ఫ్యాను'కు చెమటలు పట్టిస్తున్నాయి. ఇప్పటివరకూ రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, అరకు ఎంపి తనూజారాణి బీజేపీ టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరుగు తోంది. వీరిలో మిగిలిన వారిని పక్కనపెడితే..వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకునేందుకు, రాజకీయాల్లో కొన సాగడం మిథున్‌రెడ్డికి అత్యవసరం. పైగా ఆయనకు అమిత్‌షా కుమారుడు జైషా సహా, బీజేపీ జాతీయ నాయ కులు, కేంద్రమంత్రులతో సత్సంబంధాలున్నాయి.

జగన్ సీఎంగా ఉన్నప్పుడు బీజేపీ నేతలతో మిథునే లాబీయింగ్ చేశారు. ఇప్పుడు ఆ సంబంధాల కారణంతోనే, బీజేపీ వైపు చూస్తున్నారన్న ప్రచారం పార్టీ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. ఆ మేరకు మిగిలిన ఇద్దరు ఎంపీలతో బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు వైసీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇదిలా ఉండగా రాష్ట్రంలో వైసీపీకి చెందిన ఐదుగురు వైసీపీ ఎమ్మెల్యేలు బీజేపీ వైపు.. ఒక ఎమ్మెల్యే టీడీపీ వైపు చూస్తున్నారన్న వార్తలు, వైసీపీని వణుకు పుట్టిస్తున్నాయి. శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యేనాటికి అసలు వైసీపీలో ఎంతమంది ఉంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వైసీపీలో ఉన్నందున ఐదేళ్లు నియోజకవర్గాల్లో తమకు ఎలాంటి పనులు కావన్న ముందుచూపే, వారిని బీజేపీ-టీడీపీ వైపు నడిపిస్తోందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దానితో కేంద్రంలో అధికారంలో ఉన్న, బీజేపీలో చేరడమే రాజకీయంగా తెలివైన నిర్ణయంగా భావిస్తున్నారు. పైగా తాజా పరిస్థితులలో రాష్ట్రంలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు ఉందన్నది వారి నమ్మకమట. మరొక ఎమ్మెల్యే మాత్రం, టీడీపీలో చేరాలని భావిస్తున్నట్లు సమాచారం.

కాగా ఈ గోడదూకుళ్ల ఆటలో, కడప ఎంపి అవినాష్‌రెడ్డి ఎటు వైపు ఉంటారన్న మిగతా.. 3లో

అమరావతి రైతుల ఘోష వింటారా... మోదీజీ!

- ఈసారైనా ఇచ్చిన మాట నిలుపుకుంటారా?
- పదేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో రాజధానికి శంకుస్థాపన
- ఐదేళ్ల జగన్ విధ్వంస పాలనలో ఆగిన పనులు
- మూడు రాజధానులంటూ ప్రజలతో చెలగాటం
- ఐదేళ్లుగా భూములిచ్చిన రాజధాని రైతుల ఉద్యమం
- నిద్రాహారాలు మాని ప్రాణాలు అర్పించిన అమరులు
- వేధించి వందలాది కేసులు పెట్టిన జగన్ ప్రభుత్వం
- కూటమి గెలుపుతో మరోసారి రాజధానిపై ఆశలు
- మూడోసారి ఎన్నికైన తర్వాత తొలిసారి వస్తున్న ప్రధాని
- అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి
- నిర్మాణాలకు సహకారం అందించాలని విన్నపాలు
- ఆగిపోయిన నిర్మాణాల పూర్తికి సహకరించాలని ఘోష
- చంద్రబాబు ప్రమాణస్వీకారంలో మోదీ ప్రకటనపైనే ఆశలు
- పదేళ్ల కల సాకారానికి ఎదురుచూపులు

(వాసిరెడ్డి రవిచంద్ర)

అమరావతి: మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి ముఖ్యమంగా రాజధాని ప్రాంతానికి వస్తున్న మోదీకి అమరావతి రైతులు విన్నపాలు వినవలె అంటూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఆనాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ ప్రధానిగా తుళ్లూరు ప్రాంతంలోని 18 గ్రామాల పరిధిలో 36 వేల ఎకరాల మిగతా.. 3లో

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి కేసరపల్లి ముస్తాబు

- 11 ఎకరాల్లో చకచకా ఏర్పాట్లు
- లక్ష మందికి పైగా వస్తారని అంచనా
- ప్రధాని మోదీ, పలు రాష్ట్రాల సీఎంల రాక
- భారీ భద్రతపై అధికార యంత్రాంగం ఫోకస్

అమరావతి:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి కేసరపల్లి సిద్ధమవుతోంది. ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవు తున్నారు. ఈ నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లపై మిగతా.. 3లో

తెలుగు రాష్ట్రాల కేంద్రమంత్రులకు కీలక శాఖలు

తెలంగాణ/అమరావతి:

మూడోసారి కొలువు దీరిన ప్రధాని మోదీ క్యాబినెట్‌లో ఈసారి ఎన్నడూ లేని విధంగా తెలుగురాష్ట్రాలకు చెందిన కేంద్రమంత్రులకు కీలక శాఖలు కేటాయించారు. తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డికి బొగ్గు, గనుల శాఖ, బండి సంజయ్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రామ్మోహన్ నాయుడుకు పౌర విమాన యాన శాఖ, శ్రీనివాసవర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రిగా, పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణాభివృద్ధి శాఖ, కమ్యూనికేషన్ సహాయ మంత్రిగా శాఖలు కేటాయించారు.

జగన్ ఓడినా రక్తచరిత్ర ఆపలేదు

- జగన్‌కు నారా లోకేష్ హెచ్చరిక
- హత్యారాజకీయాలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు
- వైసీపీ ఫ్యాక్షన్ దాడులకు చెక్ పెడతాం
- గౌరీనాథ్ కుటుంబానికి అండగా ఉంటాం
- నిందితులను వదిలే ప్రసక్తే లేదు

అమరావతి:

వైసీపీ దాడులపై, కర్నూలు జిల్లాలో టీడీపీ కార్యకర్త హత్యపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మిగతా.. 3లో

స్వామి వారూ బాబు భక్తుడేనట!

- గతంలో బాబు కోసం పనిచేశానన్న స్వరూపానంద
- సీఎంగా ముహూర్తబలం కూడా భేషుగ్గా ఉందట
- నాలుక మడతేసిన విశాఖ స్వరూపానంద స్వామి
- ఐదే ళ్ల క్రితం జగన్ కోసం తపశ్శక్తులు ధారపోశానన్న స్వామి
- జగన్‌ను సిగ్గులేకుండా ముద్దుపెట్టుకున్న జగద్గురువు
- విశాఖలో భూకబ్జా ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి
- ఆశ్రమం పక్కనే పెరిగిన రియల్‌ఎస్టేట్ వ్యాపారం
- సర్కారు మారటంతో మీడియా ముందుకొచ్చిన స్వామి
- కొత్తగా బాబు భజనతో అతి తెలివి
- సిగ్గులేని స్వామి అంటూ బ్రాహ్మణ సంఘాల సీరియస్
- ఆస్తులు కాపాడుకునేందుకే బాబు భజన అంటూ విమర్శలు
- స్వామి భూకబ్జాలపై విచారణకు టీడీపీ బ్రాహ్మణనేత శ్రీధర్ డిమాండ్

సొమ్ములోరి ఊసరివెల్లి స్వరూపం

ఇక్కడా అక్కడా తన భోక్తలిద్దరూ 15 ఏళ్లు కొనసాగమని తానిచ్చిన ఆశీర్వాదంతో వారి రాజకీయ జీవితాలే బుగ్గి అయ్యేసరికి సర్వసంగభూఫలహార ప్రియుడు వారిద్దరినీ త్యజించి కొత్త బకరా భక్తుల కోసం ఎదురుచూస్తున్నాడు ఆశీర్వ'దించేద్దామని.

మిగతా.. 6లో

పీఎం కిసాన్‌పై మోదీ తొలి సంతకం

- 17వ విడత నిధుల విడుదల
- 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం

దిల్లీ:

మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోదీ పీఎం కిసాన్ నిధుల విడుదలకు సంబంధించి తొలి సంతకం చేశారు. అనంతరం మాట్లాడుతూ మాది కిసాన్ కళ్యాణ్‌కు పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం. అందుకే తొలి సంతకం రైతు సంక్షేమానికి సంబంధించిన కావడం సముచితమని పేర్కొన్నారు. రాబోయే కాలంలో రైతులు, వ్యవసాయ రంగానికి మరింత కృషి చేయాలని మేము మిగతా.. 3లో

ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేసి తీరాల్సిందే

- పూర్తి డేటా సేకరించి ప్రణాళిక సిద్ధం చేయండి
- రూ.2 లక్షల వరకు జాబితా వ్యయాన్ని ఇవ్వాలి
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్:

రుణమాఫీకి సంబంధించి విధివిధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పంట రుణమాఫీ, ఇతర అంశాలపై వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారు లను ఆదేశించారు. రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. మిగతా.. 3లో

కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు

6లో



శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు

6లో

ఇక అమరావతికి కొత్త కళ

6లో

మెగా డీఎస్సీపై తొలి సంతకం

4లో

3

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, జూన్ 2024

జగన్‌పై తిరుగుబాటు?

(మొదటిపేజీ తరువాయి..)

ఆసక్తికరమైన చర్చకు తెరలేచింది. వివేకానంద హత్య కేసులో ఇప్పటికే బెయిల్‌పై తిరుగుతున్న అవినాష్ మెడపై, ఆ కేసు కత్తి వేళ్లాడుతూనే ఉంది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో.. అవినాష్‌ను ఎప్పుడైనా అరెస్టు చేసి, జైలుకు పంపించవచ్చన్న ప్రచారం జోరుగా వినిపిస్తోంది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు, కేంద్రంలోని బీజేపీతో ఉన్న సత్సంబంధాల కారణంగా జగన్-అవినాష్ కేసులు నత్తలతో పోటీ పడ్డాయి. జగన్ సీఎంగా ఉన్నప్పుడు వ్యవస్థలను మేనేజ్ చేయడం వల్ల, ఇప్పటివరకూ జగన్ కోర్టుకు హాజరుకాలేదన్న విమర్శలు కూడా లేకపోలేదు.

ఈ క్రమంలో అవినాష్ ఎటు వైపు ఉంటారు? అన్న వైపా? బీజేపీ వైపా? అన్న ఆసక్తికరమైన చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. గతంలో అవినాష్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని సునీత కోరినప్పుడు.. 'అతనిపై చర్య తీసుకుంటే బీజేపీలో చేరతార'ని జగన్ అన్నట్లు, స్వయంగా సునీతనే వెల్లడించిన విషయం తెలిసిందే. అదే నిజమైతే కేసుల భయానికి, అవినాష్ బీజేపీలో చేరినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదంటున్నారు.

అటు జగన్ బంధువు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా పార్టీని వీడతారన్న ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ముందు ఇళ్ల స్థలాల కోసం సీఎంఓ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా, ధనంజయరెడ్డి పట్టించుకోలేదన్న ఆగ్రహం బాలినేనిలో లేకపోలేదు. ఎన్నిసార్లు జగన్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినా ఇవ్వకపోవడం, ఎన్నికలకు ముందు ఇళ్ల స్థలాలకు నిధులు విడుదల చేయడం, తన ఇష్టానికి వ్యతిరేకంగా చెవిరెడ్డిని ఎంపీగా తీసుకురావడాన్ని బాలినేని జీర్ణించుకోలేకపోయారు. అయినా బంధుత్వం కారణంగా వైసీపీని వీడలేకపోయారు. ఇప్పుడిక వైసీపీకి భవిష్యత్తు లేదన్న నిర్ణయానికి వచ్చిన బాలినేని, బీజేపీలో చేరాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కాగా కేంద్ర రాజకీయాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్న జగన్.. తన పులివెందుల శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి, లోక్‌సభకు పోటీచేయాలని భావిస్తున్నారు. అసెంబ్లీలో తన పాత్ర ఏమీలేదని గ్రహించిన తర్వాతనే, ఆయన ఈ నిర్ణయానికి వచ్చారంటున్నారు. ఈ చర్చ గత మూడు రోజులుగా పార్టీలో, అంతర్గతంగా జరుగుతోంది.

దానికోసం అవినాష్‌రెడ్డితో ఎంపీ పదవికి రాజీనామా చేయించి, ఉప ఎన్నికలో జగన్ పోటీ చేయాలని భావిస్తున్నారట. అదే సమయంలో తాను రాజీనామా చేసిన పులివెందుల స్థానం నుంచి.. భార్య భారతీరెడ్డిని బరిలోకి దించి, పార్టీ పగ్గాలు కూడా ఆమెకు అప్పగించాలని యోచిస్తున్నారట.

కోరికలు, వ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ.. అవినాష్‌రెడ్డి తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అన్నదే ప్రశ్న. గత నెల వరకూ జగన్ సీఎం కాబట్టి, అవినాష్ ఆయన ఆదేశాలు పాటించక తప్పని అనివార్యత. కానీ ఇప్పుడు జగన్ అధికారంలో లేరు. పైగా ప్రస్తుతం జగన్ మేలు కంటే, తన కేసు ముఖ్యం. ఎంపీగా ఉన్నంతవరకే తనకు రక్షణ అన్న సంగతి అవినాష్‌కు తెలుసు. అందుకే ఇటీవలి ఎన్నికల్లో మీరు అసెంబ్లీకి ఈ ఓటు వేసుకుని, ఎంపీకి నాకు వేయమని అవినాష్.. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులతో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నారన్న వార్తలు వెలువడిన విషయం తెలిసిందే.

అంటే చివరకు వైసీపీ ఓడిపోయినా.. జగన్ పరువుపోయినా ఫర్వాలేదు గానీ, తనను మాత్రం ఎంపీగా గెలిపించాలన్న అవినాష్ కోరిక బయటపడింది. అలాంటి అవినాష్.. అన్న జగన్ కోసం తన ఎంపీ పదవిని త్యాగం చే స్తారా?.. ఇదే ఇప్పుడు వైసీపీ వర్గాలో హాట్‌టాపిక్.

విజయసాయిరెడ్డి కూడా బీజేపీ వైపే?

వైసీపీ దళపతి జగన్‌కు మరో శరాఘాతమిది. పార్టీలో చాలా కాలం నెంబర్‌టూగా ఉన్న, ఎంపి విజయసాయిరెడ్డి కూడా బీజేపీలోకి జంపయిపోతున్నారట. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతే వైసీపీ పార్లమెంటరీపార్టీ నేతగా ఉన్న వేణుంబాక విజయసాయిరెడ్డి బీజేపీలో చేరతారన్న వార్తలు, ఎన్నికల సయంలోనే జోరుగా సాగాయి. అయితే వాటిని ఆయన ఖండించకపోవడం గమనార్హం.

నిజానికి జగన్ కోసం అందరికంటే ఎక్కువ త్యాగాలు చేసిన విజయసాయిరెడ్డిని, జగన్ అనేకసార్లు అవమానించారన్న చర్చ అప్పుడే జరిగింది. విజయసాయి జైల్లో ఉన్నప్పుడు తనకు కేటాయించిన లాయర్లకు సంబంధించి, సజ్జల వ్యవహరించిన తీరుపై ఆయన ఆగ్రహంతో రగిలిపోయేవారట. తనకు ఢిల్లీ స్థాయి లాయర్లు అవసరం లేదన్న సజ్జల తీరు, అప్పట్లో ఆయనకు ఆవేదన కలిగించింది. పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా వారిద్దరి మధ్య ఉప్పు-నిప్పుగానే ఉండేది.

అనేక జిల్లాలకు కో ఆర్డినేటర్లు, పార్టీ ఆఫీసు పెత్తన ం చేసిన విజయసాయికి అన్ని అధికారాలు కట్ చేసి, కొన్నిటికే పరిమితం చేశారు. సజ్జలతో విజయసాయి అధికారాలకు కత్తెర వేశారు. అసలు వైవి సుబ్బారెడ్డికి రాజ్యసభ సీటు ఇచ్చింది కూడా విజయసాయికి చెక్ చెప్పడానికేనన్నది ఒక ప్రచారం. ఓడపోతారని తెలిసే, విజయసాయిని నెల్లూరు ఎంపీ బరిలో దింపారన్నది మరో టాక్. ఢిల్లీలో జగన్ కోసం పీఎంఓలో సైతం లాబీయింగ్ చేసిన విజయసాయిరెడ్డి సైతం, జగన్ తీరుతో విసిగిపోయారంటున్నారు. దానితో బీజేపీ పెద్దలతో తనకున్న సంబంధాలు వినియోగించుకుని, ఆ పార్టీ చేరాలని విజయసాయి భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అమరావతి రైతుల ఘోష వింటారా... మోదీజీ!

(మొదటిపేజీ తరువాయి..)

భూవిస్తీర్ణంలో రైతుల వద్ద స్వచ్ఛందంగా భూములను సేకరించి అమరావతి రాజధాని ప్రకటించారు. అమరావతి రాజధాని పనుల నిర్మాణ శంకుస్థాపన అబ్బురాజుపాలెం గ్రామం వద్ద పదేళ్ల క్రితం మోదీ చేతుల మీదుగా జరిగింది. ఆ తర్వాత రాజధాని ప్రాంతంలో రోడ్లు భవనాలు, అంతర్గత డ్రైన్లు, ఎమ్మెల్యే, ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్, సచివాలయ నిర్మాణం వంటి కొన్ని పనులు చంద్రబాబు ఐదేళ్ల కాలంలో చకచకా చేయగలిగా రు. అయితే ఆ తర్వాత జగన్ రాగానే అమరావతి కేవలం శాసన రాజధానిగా మూడు రాజధానుల ఆట ప్రారంభించారు. దాంతో భూములు ఇచ్చిన రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు ఐదేళ్ల పాటు నిరంతరాయం గా ఆయా గ్రామాల రైతుల రైతులం పోరాటం చేశారు. జగన్ ప్రభుత్వం వందలాది కేసులు పెట్టింది. రాజధానిని కాపాడుకునేందుకు కోర్టుల చుట్టూ తిరిగారు. దేవాలయాల చుట్టూ ప్రదర్శనలు చేశారు. ఇలా అమరావతి రాజధా నిగా ఉండాలని యజ్ఞం సాగించారు.

అమరావతి పూర్వవైభవానికి నిధులు కేటాయించాలి

కూటమి గెలుపుతో ఎన్డీఏ ప్రభుత్వంలో చంద్రబాబు చేరడం మరో శుభం పరిణామంగా అమరావతి రైతులు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు, మోదీ కలయిక రాష్ట్ర అభివృద్ధికి కలిసొచ్చే అంశంగా మారింది. ఇందులో భాగంగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి వస్తున్న మోదీకి తమ విన్నపాలు వినిపిస్తున్నారు. తిరిగి అమరావతి రాజధానిని ప్రజా రాజధానిగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం అమరావతికి పూర్వవైభవానికి అవసరమైన నిధుల మంజూరుకు మోదీ హామీ ఇవ్వాలని విన్నవిస్తున్నారు. ఆగిన భవనాలను పూర్తిచేయాలని, రోడ్లను, డ్రైన్ నిర్మాణాలను పూర్తిచేయాలని వేడుకుంటున్నారు. రాజధానిని హైదరాబాదు వలె అభివృద్ధిలో పరుగులు తీయించాలని, అందుకు అవసరమైన నిధులకు కేంద్రం సహకరించే విధంగా ప్రధాని హామీ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఎంతో త్యాగం చేసి తమ భూములు రాజధాని కోసం అప్పగించామని ఆ ప్రాంతాన్ని రాజధాని ప్రాంతంగా ప్రజా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరు కుంటు న్నారు. ఇందుకు అవసరమైన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని అభ్యర్థిస్తున్నారు. అమరావతి ఆంధ్ర రాష్ట్ర రాజధాని అని స్పష్టమయ్యేలా అభివృ ద్ధి జరగాలని రైతాంగం విన్నవిస్తున్నారు. అంతేకాకుండా తమపై ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి రైతుల కలలకు సహకారం అందించేలా సభలో ఏమైనా ప్రకటన చేస్తారా లేదా అన్నది వేచిచూడాలి.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి కేసరపల్లి ముస్తాబు

(మొదటిపేజీ తరువాయి..)

అధికార యంత్రాంగం ఫోకస్ పెట్టింది. 11 ఎకరాల స్థలంలో జెట్ స్పీడ్‌తో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐదుగురు ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో ఘనంగా ప్రమాణ స్వీకార ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదిక, సీటింగ్, భద్రత, పార్కిం గ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నారు. ప్రముఖులతో పాటుగా దాదాపు లక్ష మందికి పైగా ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నారు.

80 వేల మందికి సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేసి తీరాల్సిందే

(మొదటిపేజీ తరువాయి..)

పూర్తి స్థాయిలో బ్యాంకర్ల నుంచి రైతుల వివరాలు సేకరించి అర్హులను గుర్తించాలని తెలిపారు. కటాఫ్ డేట్ విషయంలో సమస్యలు తలెత్త కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. కేవలం బ్యాంకుల నుంచే కాకుండా, పీఏసీఎస్ నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేసేందుకు పూర్తి స్థాయి వివరాలతో పాటు అవసరమైన అంచనా వ్యయాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. రుణమాఫీకి సంబంధించి విధివిధానాలను రూపొందించి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15లోగా పంట రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి అధికారులకు తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు: రేవంత్

తెలుగురాష్ట్రాల నుంచి కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మకు ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విభజన చట్టంలోని అంశాల అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, పథకాలు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాల్సిందిగా ఆకాంక్షించారు.

జగన్ ఓడినా రక్తచరిత్ర ఆపలేదు

(మొదటిపేజీ తరువాయి..)

నారా లోకేష్ స్పందించారు. వైఎస్ జగన్ ఓడిపోయినా రక్త చరిత్ర రాస్తూనే ఉన్నాడని ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకి చెందిన టీడీపీ నేత గౌరీనాథ్ చౌదరిని దారుణంగా హత్య చేయించారు. వైసీపీ ఫ్యాక్షన్ పాలన వద్దని జనం ఛీకొట్టినా, బాబాయ్‌ని చంపినట్టే జనాన్ని చంపుతూ ఉన్నాడు జగన్ రెడ్డి. హత్యా రాజకీయాలు ఇకనైనా ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చ రించారు. గౌరీనాథ్ చౌదరి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని, నిందితు లను వదిలే ప్రసక్తే లేదని తెలిపారు. వైసీపీ ఫ్యాక్షన్ దాడులకు చెక్ పెడతామని, శాంతిభద్రతలు కాపాడుతామని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కొత్తగా ఎన్నికైన టీఎస్‌సీఏబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వైస్ చైర్మన్ సత్తయ్య, పాలకవర్గ సభ్యులు దేవేందర్ రెడ్డి, వెంక టేశ్వర్లు, రమేష్, భోజిరెడ్డి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని రేవంత్ అభినందించారు.

పీఎం కిసాన్‌పై మోదీ తొలి సంతకం

(మొదటిపేజీ తరువాయి..)

కోరుకుంటున్నామని వ్యాఖ్యానించారు. పీఎం కిసాన్ 17వ విడత విడుదలకు అనుమతిస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. దీని వల్ల 9.3 కోట్ల మంది రైతులకు దాదాపు 20,000 కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.

నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు

అమరావతి:

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని నివాసంలో పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, మర్యాదపూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా పరస్పరం అభినందనలు తెలుపుకున్నా రు. భారీ మెజారిటీలతో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను లోకేష్ అభినందించారు. తనని కలవడానికి వచ్చిన కార్యకర్తలను అప్యాయంగా పలకరించి అందరితో ఫొటోలు దిగారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, జూన్ 2024

పాక్ ఓటమి..
ఆ దేశ ప్రధానిపై నెటిజన్ల ట్రోల్స్

టీ20 వరల్డ్‌కప్‌లో తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌ను 119 రన్స్‌కే పాకిస్తాన్ కట్టడి చేయడంతో ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ట్వీట్ చేశారు. 'పాక్ టీమ్ గ్రేట్ బౌలింగ్. టోర్నీలో ఇది గొప్ప మ్యాచ్ అవుతుందని ఆశిస్తున్నా. చేజింగ్‌కు దిగే అబ్బాయిల కు ఆల్ ది బెస్ట్' అని రాసుకొచ్చారు. అయితే పాక్ మ్యాచ్ ఓడిపోవ డంతో ఆయన మళ్లీ ఎలాంటి ట్వీట్ చేయలేదు. దీంతో 'గుర్తుపెట్టుకోండి.. ఎప్పుడూ ముందే సంబరాలు చేసుకోవద్దు' అంటూ నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.

మెగా డీఎస్సీపై తొలి సంతకం

- ఏపీలో 39,008 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- చంద్రబాబు ప్రమాణస్వీకారంలో ప్రకటనకు సిద్ధం

అమరావతి:
రాష్ట్రంలో 39,008 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గతేడాది జూల్కెలో లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడిం చింది. 2023 జూల్కె 31న లోక్‌సభలో ఒక ప్రశ్నకు అప్పటి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణదేవి ఈ సమాధానమిచ్చారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 2022-23లో 39,008, 2021-22లో 38,191, 2020-21లో 22,609 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ సందర్భంగా వివరించా రు. దీంతో ఎన్నికల్లో మెగా డీఎస్సీపై తొలి సంతకం పెడతామని ప్రకటించిన చంద్రబాబు బుధవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉండటంతో విద్యా శాఖ అందుకు సంబంధించిన ఖాళీల

వివరాలతో అప్రమత్తమైంది. ఇప్పటికే ఖాళీ పోస్టుల వివరాలు పంపాలని సంబంధిత అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. మూడునెలల క్రితం విడుదల్కెన నోటిఫికేషన్‌లో 6,100 పోస్టులు ఉన్నాయి. అయితే తాజాగా 30 వేల ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

వేములవాడ ఆలయానికి భక్తుల తాకిడి

వేములవాడ:
స్థానిక రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ధర్మ దర్శనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ముందుగా పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారికి ఇష్టమైన కోడె మొక్కలతో పాటు ఇతర మొక్కులు చెల్లించుకుని సేవలో తరించారు. స్వామి వారికి ఇష్టమైన సోమవారం రోజు కావడంతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

జగన్‌పై తిరుగుబాటు చేసిన
గిరిజనులకు ధన్యవాదాలు

- 12న ప్రమాణస్వీకారానికి పెద్దఎత్తున తరలిరండి
- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్

అమరావతి:
రాష్ట్రంలో కూటమి గెలిచిన ఐదు గిరిజన నియోజవర్గాల్లోనే కాకుండా మిగిలిన 159 నియోజకవర్గాలలో జగన్‌పై తిరుగుబావుటా ఎగురవేసి కూటమికి మద్దతు తెలిపిన గిరిజన ఓటర్లకు పార్టీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, అదే స్ఫూర్తితో ఈ నెల 12న గన్నవరంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం తెలియజే యాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ గిరిజనులను ఒక ప్రకటనలో కోరారు. జగన్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిన 16 గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు పూర్వ వైభవం రానుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

జగన్ కుటుంబం కలిసిపోవాలి

- పూనమ్‌కౌర్ ఆసక్తిక ట్వీట్ వైరల్
- భిన్నంగా స్పందిస్తున్న వైసీపీ అభిమానులు

అమరావతి: టాలీవుడ్ ప్రముఖ నటి పూనమ్ కౌర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గతంలో తెలుగుతో పాటు పలు భాషల్లో నటించిన ఈ అమ్మడు ఇప్పుడు సినిమాలకు దూరంగా ఉంది. అయితే సినిమాయేతర విషయాలతో ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది అందాల తార. ముఖ్యంగా ఏపీ రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని పూనమ్ చేసే ట్వీట్లు నెట్టింట తెగ వైరలవుతుంటాయి.

ఇటీవలే ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై స్పందించిన ఆమె 'వై నాట్ 175 అనే విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు చాలా సీరియస్‌గా తీసుకున్నట్టున్నారు' అని ట్వీట్ చేసింది. ఆ తర్వాత అధికారంలోకి రాబోతున్న టీడీపీ, జనసేన కూటమి గురించి కూడా ట్వీట్ చేసింది. సుగాలి ప్రీతి కేసును త్వరగా పరిష్కరించాలం టూ కోరింది. తాజాగా మరో ఆసక్తికర ట్వీట్ చేసింది. జగన్ తన ఫ్యామిలీతో కలిసిపోయి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. 'గత ఎన్నికల్లో జగన్ విజయానికి భార్య భారతి, తల్లి విజయమ్మ, సోదరి షర్మిలది కీలకపాత్ర. వారు తమద్కెన మార్గాల్లో సహనం, పట్టుదలను నేర్పారు. ఇప్పుడు వారంతా కలిసుండాలని కోరుకుంటున్నా' అని పూనమ్ ట్వీట్ చేసింది. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల వుతోంది. దీనిపై వైసీపీ అభిమానులు, కార్యకర్తలు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. వైఎస్ జగన్ తన ఫ్యామిలీతో కలిసిపోయి మరింత బలంగా ప్రజల్లోకి రావాలని కోరుతూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

చంద్రబాబు కోసం కొత్త కాన్వాయ్ రెడీ

అమరావతి: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న టీడీపీ అధినేత చంద్రబాబు కోసం కొత్త కాన్వాయ్ రెడీ అయింది. టొయోటా కంపెనీకి సంబం ధించిన 11 బ్లాక్ కలర్ వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. 393 నెంబరును కాన్వాయ్ వెహికల్స్‌కు కేటాయించారు.

మాజీ మంత్రి తలసాని సోదరుడి మృతి

- హరీష్‌రావు, ఎర్రబెల్లి నివాళి

హైదరాబాద్: మోండా మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ అనారోగ్యంతో చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. బోయిన్‌పల్లి మార్కెట్ అధ్యక్షుడిగా శంకర్ యాదవ్ అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరా లని భగవంతుడిని ప్రార్థించారు.

బాబు గెలుపు కోసం అప్పుడే పనిచేశా..

- చంద్రబాబును కొత్తగా పొగుడుతున్నానని అనుకోవద్దు
- ప్రమాణ స్వీకార ముహూర్తం బలమైనది
- రుషికేశ్ వెళుతున్నా..ముందుగా ఆశీర్వదిస్తున్నా
- ఆయన గొప్పగా పరిపాలిస్తారు
- ఈసారైనా దేవాలయాల పాలన బాగుండాలి
- అమరావతిలోనూ శారదాపీఠం నిర్మిస్తాం
- విశాఖ స్వరూపానంద సరస్వతి వ్యాఖ్యలు

విశాఖపట్నం: శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి సోమవారం మీడియా సమావేశంలో కూటమి గెలుపుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రభు త్వం మారింది. గతంలో కూడా ఉన్నది ఉన్నట్టే మాట్లాడే వాళ్లం తప్ప సంపాదన కోసం ఉన్న పీఠం మాది కాదు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఆనందంగా ఉంది. చంద్రబాబు ప్రమాణ స్వీకార ముహూర్తం బలమైనది. ప్రజలకు మేలు గలిగేలా రాష్ట్రానికి ప్రయోజనం చేకూరేలా పరిపాలించాలని ఆశీర్వాదం అందజేస్తున్నాం. కేంద్రంతో ఉండే సన్నిహిత సంబంధాలతో చంద్రబాబు గొప్పగా పాలించగలరని ఆశిస్తున్నాం. అమరావతిలో కూడా శారదా పీఠం నిర్మిస్తాం. ఏ ప్రభుత్వం వచ్చినా నిష్పక్షపాతంగా రాజశ్యామల అమ్మవారి ఆశీస్సులు ఉంటాయి. త్వరలోనే చాతుర్మాస దీక్షల కోసం రుషికేశ్ వెళ్తున్నా. అందుకే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముందే ఆశీస్సులు అందిస్తున్నా. హైదరాబాద్‌లోని శారదా పీఠంలో స్థిరపడాలని అనుకుంటున్నాం. నాకు అత్యంత ఆత్మీయుడు అయిన ఎర్రన్నాయుడు కుమారుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేబినెట్ మంత్రి కావడం సంతోషంగా ఉంది. అమ్మవారి కృపతో మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఆనందం కలిగించిందని వ్యాఖ్యానించారు.

చంద్రబాబును కొత్తగా పొగుడుతున్నానని అనుకోవద్దు

చంద్రబాబు గెలవాలని గతంలో మురళీమోహన్‌తో కలిసి సాధువులందరితో కలిసి సమావేశం ఏర్పాటు చేసి పూజలు చేశాం. ఎవరికీ భయపడి ఈ ప్రెస్ మీట్ పెట్టడం లేదు. తప్పుడు అభిప్రాయాలు వెల్లడిరచకుండా ప్రెస్ మీట్ పెడు తున్నాం. చంద్రబాబు అంటే చాలా గౌరవం.. చాలా సీనియర్ నేత. ఆయన ఆరోగ్యం బాగుండాలి. ఈసారైనా దేవాలయాల పాలన బాగుండాలని ఆకాంక్షించారు.

వీధి దీపాలను తక్షణమే బాగుచేయించండి

- 48 గంటల్లో కార్యాచరణ ప్రణాళిక
- అవసరమైన మెటీరియల్‌కు ప్రతిపాదనలు
- తాగునీటి రిజర్వాయర్లను శుభ్రం చేయండి
- కలుషిత నీటి సరఫరా ఫిర్యాదులపై స్పందించండి
- పూడికతీత ఫొటోలను గ్రూప్‌లో పోస్ట్ చేయాలి
- గుంటూరు కమిషనర్ చేకూరి కీర్తి ఆదేశం
- నగర సమస్యలపై అధికారులతో సమీక్ష

గుంటూరు: నగరపాలక సంస్థ పరిధిలోని వీధి దీపాలు అన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని, వీధి దీపాలకు సంబంధించి ప్రజల నుండే అందే ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కరించేలా ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకోవా లని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలో వీధి దీపాలు, తాగునీటి సరఫరా, అవుట్ ఫాల్ డ్రెన్లలో పూడికతీత పనులు తదితర అంశాలపై ఎస్ఈ, ఈఈలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి దీపాల మరమ్మ తులకు అవసరమైన మెటీరియల్ కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి ఎస్ఈ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తమకు పంపాలన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అందే ఫిర్యాదులు, వాటి వివరాలపై ప్రతిరోజు తమకు నివేదిక ఇవ్వాలని సూచించారు. నగరంలో ప్రతి రిజర్వాయర్ నిర్దేశిత షెడ్యూల్ మేరకు శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాలో కలుషిత నీటి సరఫరాపై అందే ఫిర్యా దుల పట్ల తక్షణ స్పందన ఉండాలన్నారు.

ఏఈల వారీగా ఎమినిటి కార్యదర్శులు తాగునీటి సరఫరా సమయాల్లో శాంపిల్స్ తీసి గ్రూప్‌లో పోస్ట్ చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభమైనందున నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా ఏఈలు పర్యవేక్షణ చేయాలన్నారు. నగరంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెన్లలో జరుగుతున్న పూడికతీత పనులను ఈఈలు నేరుగా పరిశీలించాలన్నారు. పూడిక సక్రమంగా తీసేలా పూడిక ముందు, తర్వాత ఫొటోలు గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. పూడిక తీసే ప్రాంతాల్లో ఏమైనా ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్ఈ శ్యామ్ సుందర్, ఈఈలు సుందర్రామి రెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, జూన్ 2024

కష్టపడిన కార్యకర్తకు దక్కిన గౌరవం

- పార్టీ బలోపేతానికి మరింత కష్టపడతా.
- కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

దిల్లీ,మహానాడు: పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తకు అవకాశాలు ఉంటాయని చెప్పేందుకు తానే ఉదాహరణ అని నరసాపురం ఎంపీ, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు. కేంద్రమంత్రిగా అవకాశం రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఇది ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్న బీజేపీ కార్యకర్తలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ప్రోత్సహించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు చెబుతున్నానని, పార్టీ బలోపేతానికి మరింత కష్టపడతానని వ్యాఖ్యానించారు.

పార్టీ కార్యాలయంలో సంబరాలు

మోదీ భారత ప్రధాని ప్రమాణ స్వీకార సమయంలో విజయవాడ

బీజేపీ రాష్ట్ర కార్యాలయం దగ్గర బాణసంచా కాలుస్తూ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేంద్రమంత్రిగా చోటు దక్కించుకున్న నరసాపురం ఎంపీ శ్రీని వాస్ వర్మకు శుభాకాంక్షలు తెలిపారు.

జగన్ ముఠా మింగిన ప్రతి పైసా కక్కించి తీరుతాం

- ఇసుక, మద్యం సహా అన్ని శాఖలలో అవినీతి
- వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు

వినుకొండ,మహానాడు: ఐదేళ్లుగా అడ్డుఅదుపూ లేని దోపిడీతో జగన్ రెడ్డి ముఠా మింగిన ప్రతిపైసా కక్కించి తీరుతామని వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు అన్నారు. అప్పటి వరకు తాడేపల్లి నుంచి బయటకు దారి తీసే ప్రతిమార్గంలో పోలీసులు నిశితంగా నిఘా పెట్టాలని సూచించారు. తాడేపల్లి ప్యాలెస్, చుట్టుపక్కల ప్రాంతాల్లోనే వైకాపా దొంగలు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారన్న సమాచారం నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరన్నారు.

ఇసుక, మద్యం సహా వైకాపా ప్రభుత్వంలో జరిగిన ప్రతి అవినీతి, అక్రమాలపై సరైన రీతిలో విచారణ జరిపించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. జ్యుడీషియల్ కమిషన్లు, ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి అందరినీ బోనులో నిలబెట్టాలని కోరారు. మరీ ముఖ్యంగా సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా పనిచేసిన విజయ్‌కు మార్ రెడ్డిని అడ్డం పెట్టుకుని జగన్‌రెడ్డి సొంత పత్రికకు వందల కోట్ల ప్రకటనలు, డిజిటల్ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా ఐప్యాక్, అనుకూల మీడియా సంస్థలు, వ్యక్తులకు అక్రమంగా మళ్లించిన వందల కోట్ల రూపాయల లావాదేవీలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని కోరారు.

భువనేశ్వరి, లోకేష్‌ను కలిసిన చదలవాడ దంపతులు

నరసరావుపేట,మహానాడు: ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో నారా భువనేశ్వరి, నారా లోకేష్‌లను కుటుంబంతో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు దంపతులు కలిసి అభినందనలు తెలిపారు. నరసరావుపేట వంటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేసే అవకాశం చంద్రబాబు ప్రోత్సాహంతో మాత్రమే సాధ్యమైందని చదలవాడ పేర్కొన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని శాసనసభకు పంపించిన ఘనత చంద్రబాబు, తెలుగు దేశం పార్టీది మాత్రమేనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తానని తెలిపారు.

నరసరావుపేట, సత్తెనపల్లిలో బాలయ్య జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- పాల్గొన్న అభిమానులు, టీడీపీ నాయకులు

నరసరావుపేట/సత్తెనపల్లి: యువరత్న నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు నరసరావుపేట, సత్తెనపల్లిలో ఎన్‌బీకే అభిమానులు, టీడీపీ, నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా జరిగాయి. నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో గోను గుంట్ల కోటేశ్వరరావు, ఆదిత్య బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పల్నాడు జిల్లా ఐటీడీపీ అధికార ప్రతినిధి

గుత్తా అంకమ్మ చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి పట్టణం రఘురామ్‌నగర్ ప్రజావేదికలో నంద మూరి బాలకృష్ణ 64వ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్తెనపల్లి పట్టణంలోని ఆదరణ వయోవృద్ధుల ఆశ్రమం, మోల్లమాంబ వయోవృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు

- మంగళగిరిలో కేక్ కట్‌చేసిన వర్ల రామయ్య
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు

అమరావతి: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య కేక్ కట్ చేసి ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సినీ నిర్మాత, దక్షిణ భారత నిర్మాతల సంఘ అధ్యక్షుడు కాట్రగడ్డ ప్రసాద్‌కు తినిపించారు. స్వీట్లు పంచి పెట్టారు. బాలకృష్ణ సేవలను కొనియాడారు. బాలకృష్ణ ఎమ్మెల్యేగా హిందూపు రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సమాజ హితమైన సినిమాల తో మరింత పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ అధ్యక్షురాలు నన్నపనేని రాజకుమారి పాల్గొని బాలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, కాపు మల్లికార్జున యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబటి రాంబాబుకు చీర, జాకెట్, పూలు

- ఆయన ఇంటికి వెళ్లిన తెలుగు విద్యార్థి నేతలు
- సుకన్య, సంజనాలతో ప్రమాణస్వీకారానికి ఆహ్వానం
- అడ్డుకున్న పోలీసులు...సత్తెనపల్లిలో ఉద్రిక్తత

సత్తెనపల్లి: మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటి దగ్గర ఉద్రిక్తత నెలకొంది. తెలుగు విద్యార్థి నేతలు ఆయనకు చీర, జాకెట్, పూలు ఇచ్చేందుకు వెళ్లారు. సుకన్య, సంజనాలతో చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానం పలికేందుకు వెళ్లారు.

వారిని పోలీసులు అడ్డుకోవడంతో అంబటి ఇంటి ముందు వాటిని కుర్చీలో పెట్టి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీ, రాయపాటి అమృత రావు తదతరులు పాల్గొన్నారు.

కోటప్పకొండకు టీడీపీ శ్రేణుల పాదయాత్ర

- ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు
- కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ

నరసరావుపేట: నియోజకవర్గంలో జగన్‌రెడ్డి అరాచకాలను, అకృత్యాలకు ఎదు రొడ్డి చదలవాడ అరవింద బాబు గెలిచిన నేపథ్యంలో పమిడిపాడు గ్రామ టీడీపీ నేతలు కోటప్ప కొండకు పాదయాత్ర చేపట్టారు. చదలవాడ అరవిందబాబు దగ్గరుండి పాదయాత్రను ప్రారంభించారు. పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలు ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీని అడ్డుకునే సత్తా ఎవరికీ లేదన్నారు. ప్రజల అండ, కార్యకర్తల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. పార్టీని ప్రాణంగా భావించే కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సొంతమన్నారు.

దేశంలో కార్యకర్తల ఆశీర్వాదంతో నడిచే పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. కార్యకర్తల కష్టానికి ప్రతి ఫలం తప్పకుండా దక్కుతుందని, ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి తీరుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

తెనాలి: గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెండురోజుల క్రితం తనను కలిసిన పోలీసులకు గంజాయిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌ను కోరారు.

దాంతో నిఘా పెట్టిన పోలీసులు గంజాయి విక్రయిస్తున్న బాలాజీరావుపేటకు చెందిన ఎనిమిది మందినిని అరెస్టు చేశారు. వారి దగ్గర రూ.40 వేల విలువైన రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
6
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, జూన్ 2024

స్వామి వారూ బాబు భక్తుడేనట!

(మూర్తి సుబ్రహ్మణ్యం)

ఆ స్వామికి సిగ్గు, ఎగ్గూలేదు... ఆస్తులు కాపాడుకోవడమే ఆయన లక్ష్యం..

మొన్నటి వరకూ జగన్‌కు పెట్టిన ముద్దులేమయ్యాయి స్వామీ..

మీ అతితెలివితేటలు ఇక ఆపండి. ఇప్పుడు ఆయన పాత చంద్రబాబు కాదు.

త్వరలో చినముషిడివాడలోని మీ వైసీపీ ఆఫీసు ఖాళీ అవుతుంది. ఇక తెలంగాణకు దుకాణం సర్దేయండి స్వామీ..

స్వామీ.. జగన్‌తో కలసి ఇంకా నదికిపోలేదా?

జగన్‌కు పెట్టిన ముద్దులు సరిపోక బాబుకు పెట్టాలనా మీ ఆలోచన?

మీరు చేసిన రాజశ్యామలయాగంతో కేసీఆర్‌ను 119 సీట్లతో గెలిపించారు. ముద్దులుపెట్టి జగన్నను 171 సీట్లతో గెలిపించారు. ఇక నాటకాలు చాలించి, మీ అసలు స్వరూపం బయటపెట్టండి స్వామీ..

– ఇదీ.. చంద్రబాబు కోసం తాను గతంలోనే పనిచేశానన్న,

విశాఖ పీఠాధిపతి స్వరూపానందస్వామి వ్యాఖ్యల అనంతరం.. టీడీపీ బ్రాహ్మణ నేతలు– బ్రాహ్మణసంఘాలు కమ్ సోషల్‌మీడియా నెటిజన్లు ఆయనపై కమండలంతో కొట్టి చేసిన కామెంట్లు.

జగన్ 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, ఆయన రాజ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రామరాజ్యానికి జగనన్నపాలన జిరాక్సు అంటూ.. భట్రాజులు కూడా ఈర్ష్యపడేలా పొగిడిన, విశాఖ పీఠాధిపతి శ్రీమాన్ స్వరూపానందుల వారు గుర్తున్నారా? లేరా?.. పోనీ పుష్కరాల్లో జగనన్న తలను, నీళ్లలో మూడుసార్లు ముంచి నలుగురి ఎదుటే నిస్సిగ్గుగా ముద్దులు పెట్టిన స్వరూపానందస్వామి గుర్తుందా? లేదా?...

పోనీ విశాఖలో భూములను కారుచౌకగా కొట్టేశారన్న నిందలు ఎదుర్కొంటున్న స్వామి తెలుసా?.. అదీ తెలియదా? ఓకే. ఐదేళ్లలో మంత్రులు,ఎమ్మెల్యేలు, నాయకులకోసం జగన్ దగ్గర పదవుల పైరవీ చేశారన్న ఆరోపణలకు గురైన స్వామి పేరైనా గుర్తుందా? ఆ.. యస్. ఆ స్వాములోరే ఈ సాములోరు.

ఇప్పుడు సదరు సాములోరు నాలిక అడ్డంగా మడతేసి.. తాను జగనన్నకు పెట్టిన ముద్దులు మర్చిపోయి.. మరో 15 ఏళ్లు జగనన్నే సీఎంగా ఉంటారన్న తన భవిష్యవాణికి భిన్నంగా.. అసలు చంద్రబాబు కోసం అప్పట్లో శ్రమదానం చేసిన కార్యకర్తను, తానేనని నిస్సిగ్గుగా చెప్పుకోవడం విమర్శలకు దారితీసింది. అప్పట్లో బాబు విజయం కోసం తానే పీఠాధిపతులను తీసుకు వచ్చి, టీడీపీ విజయానికి సమిధనయ్యానని ఇప్పుడు గుర్తుచే యడం, చావు తెలివేనన్నది తెలుగుతమ్ముళ్ల వాదన.

జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లూ, దేవదాయ శాఖను శాసించింది ఈ స్వామివారే. కమిషనర్లును బిళ్లబంట్రోలు లెక్క ఆడించి, ఏ దేవాలయం తన కార్యక్రమాలకు ఎంత ఇవ్వాలన్నది నిర్ణయించిందీ ఈయనే. ఎన్ని దేవాలయలు పీఠానికి ఊడిగం చేశాయో లెక్కాపత్రం లేదు. జగనన్నను కలవలేని అల్పులంతా స్వామి వారి చానెల్ ద్వారా వెళ్లిన వారే. దానికోసం స్వామివారికి

సమన్వయం చేసేందుకు సాక్షిలో పెద్ద నెట్‌వర్కే ఏర్పాటు చేసుకున్నారట.

విశాఖలో సర్కారు భూములను అప్పనంగా కొట్టేసి, దాని చుట్టూ ఉన్న భూమిని సర్కారు ఖర్చుతోనే చదును చేయించి, చుట్టుపక్కల రియల్‌ఎస్టేట్ యాపారానికి కాళ్లు తెచ్చిన సాములోరి సంగతి తేల్చాలని, ఇప్పుడు బ్రాహ్మణ సంఘం నేతలే రోడ్డెక్కి యాగీ చేయడం బ్యాడ్‌లక్. మొన్నటివరకూ సర్కారీ స్వామిగా ఉన్న స్వరూప, ఇప్పుడు నాలుక మడత పెట్టి.. నిస్సిగ్గుగా బాబు భజన చేస్తే, నమ్మేదెవర న్నది బ్రాహ్మణ సంఘాల ప్రశ్న.

పైగా స్వాములోరు కొట్టేసిన సర్కారు భూములను.. స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్న, బ్రాహ్మణ సంఘాల గళాలతో విశాఖ పీటం ఉక్కిరిబిక్కిరవుతోంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దర్మం గతి తప్పుతోందని, మతిలేని విమర్శలు చేసిన ఇదే స్వామి.. ఇప్పుడు మాటమార్చి బాబు పాలన అద్భుతంగా ఉంటుందని కితాబివ్వడం వె నుక, ఆస్తులు కాపాడుకునే వ్యూహం ఉంద న్నది టీడీపీ బ్రాహ్మణ సంఘాల ఆరోపణ. బాబు సర్కారు తన భూముల జోలికి రాకుండా ఉండేందుకు, స్వాములోరు ఇప్పటినుంచే చావు తెలివితో, ముందరకాళ్లకు బంధం వేస్తున్నారని టీడీపీ బ్రాహ్మణ సంఘాల ఉవాచ. అసలు స్వరూపా ఆక్రమించిన సర్కారు భూములపై విచారణ చేయాలన్న టీడీపీ బ్రాహ్మణ నేతల డిమాండుతో విశాఖ పీఠం వణికిపోతోందట.

ఇక అమరావతికి కొత్త కళ

- ప్రమాణస్వీకారం లోపు పరిశుభ్రత పనులు
- యుద్ధప్రాతిపదికన యంత్రాలతో చిల్లచెట్ల తొలగింపు
- రహదారులను బాగుచేయిస్తున్న అధికారులు
- కరకట్టపై విద్యుద్దీపాల పునరుద్ధరణకు చర్యలు
- కొత్త ప్రభుత్వంతో సీఆర్‌డీఏలో కదలిక
- ఆగిపోయిన భవన నిర్మాణాలపై సీఎస్ ఆరా
- విధ్వంస పాలన నుంచి కోలుకుంటున్న ప్రజలు

అమరావతి:

ఐదేళ్ల విధ్వంసం, అరాచకానికి ప్రత్యక్ష నిదర్శంగా నిలిచిన రాజధా ని అమరావతి ఇప్పుడిప్పుడే మెల్లగా కోలుకుంటోంది. రాజధాని అమరావతిలో గడచిన ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా దాన్నో చిట్టడివిలా మార్చేసిన సీఆర్‌డీఏలో కదలిక మొదల్కొంది. రాజధానిలో పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్ర మాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టింది. రాజధానికి ప్రమా ణస్వీకారం చేసిన చోట ఏర్పాటు చేసిన గ్యాలరీని వైసీపీ హయాంలో దుండగులు ధ్వంసం చేసినా చీమకుట్టి నట్టయినా లేని సీఆర్‌డీఏ అధికారులు ఆదివారం ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి గ్యాలరీని పునరుద్ధరించే పనులు చేస్తు న్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు సీఎస్ నీరభ్‌కుమార్ ఆదివారం రాజధానిలో పర్యటించి తాజా పరిస్థితిని సమీక్షించారు.

యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు

వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర రాజధాని అమ రావతి కూటమి గెలుపుతో కొత్త కళ సంతరించుకోనుంది. రాష్ట్రంలో ఎన్డీయే గెలుపు, అమరా వతి రూపశిల్పి చంద్ర బాబు ముఖ్యమంత్రి కానుండడంతో సీఆర్డీఏ ఆఫుమేఘా లపై పనులు ప్రారంభించింది. త్వరలో అసెంబ్లీ సమావేశాలు కూడా ప్రారంభం కానుండడంతో రాజధాని ప్రాంతంలో ముళ్ల కంపల తొలగింపు పనులు మూడు రోజులుగా ముమ్మ రంగా జరుగుతున్నాయి. 25 ప్రాంతాల్లో 94 పొక్లెయినర్లతో 109 కి.మీ నిడివిలోని 673 ఎకరాల విస్తీర్ణంలో కంపలను రేయింబవళ్లు తొల గిస్తున్నారు. ఈ నెల 12న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తుండడంతో అప్పటి లోగా అమరావతికి కొత్త కళ తీసుకొచ్చేందుకు అధికారు లు యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు.

విద్యుద్దీపాల పునరుద్ధరణ

కరకట్టపై వెలగని విద్యుద్దీపాలను సీఆర్‌డీఏ సిబ్బంది మారుస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుపై రెండు దశల్లో 9.60 కోట్లతో ప్రారంభించిన సెంట్రల్ ల్యాటింగ్ ప్రాజెక్టును తాజాగా పూర్తి చేశారు. కరకట్ట రోడ్డు, అసెంబ్లీ, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్ అధికారుల నివాస సముదాయాలకు వెళ్లేం దుకు మార్గాలు లేవు. ఇవి ముళ్ల పొదలతో నిండిపోయాయి. వీటిని శుభ్రం చేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న న్యాయ మూర్తుల బంగ్లాలు, న్యాయ సముదాయం, సచివాలయ టవర్లు, ఎన్జీవో అపార్ట్‌మెంట్లు, విట్ నుంచి సచివాలయానికి వెళ్లే మార్గం, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, అమృత విశ్వ విద్యాలయం, నవులూరులోని ఎంఐ జీ లే అవుట్, స్టేడియం, శాఖమూరు పార్కు, ఎన్ఐడీకి వెళ్లే మార్గాల్లో పెరిగిన ముళ్ల చెట్లను కూడా తొలగిస్తున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే లోపు రాజధానిలో పరిశుభ్రత పనులను పూర్తి చేసేలా పనులు చేస్తున్నారు.

ఆగిపోయిన కట్టడాలపై ఆరా

అమరావతిలో సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ ఆగిపోయిన భవన సదుపాయాలు, కట్టడాలను పరిశీలించారు. కర కట్ట రోడ్డు నుంచి మొదలుపెట్టి సీడ్ యాక్సెస్ రహదారిపై ఉన్న సెంట్రల్ ల్యాటింగ్‌ను పరిశీలించారు. విద్యుద్దీపాల పునరుద్ధర ణ పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ రాజధానికి భూమి పూజ జరిగిన ప్రాంతం, శంకుస్థాపన శిలాఫలకాలు, పవిత్ర మట్టి, నీరు, అమరావతి నమూనాలు ఉంచిన గ్యాలరీలను పరిశీలించారు. అనంతరం సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని పరిశీలించారు. విజయవాడలోని సీఆర్‌డీఏ కీలక విభా గాలను ప్రాజెక్టు కార్యాలయంలోకి తరలించాలని సూచించారు. జంగిల్ క్లియ ర్స్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కట్టడాల పరిస్థితి గురించి సీఆర్‌డీఏ అధికారులను సీఎస్ అడిగి తెలుసుకున్నారు. భవనాల నాణ్యతపై ఇంజనీరింగ్ అధికారు లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

సీఆర్‌డీఏ కమిషనర్ తీరుపై సీఎస్‌కు ఫిర్యాదు

సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ వ్యవహారశైలిపై రాజ ధాని రైతులు, మహిళలు సీఎస్‌కు ఫిర్యాదు చేశారు. రెండేళు ్లగా కమిషనర్ అనుసరిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్షిక కౌలు, ప్లాట్ల అభివృద్ధిపై తాము విజ యవాడ లోని ఆయనను కలిసి విన్నవించేందుకు ప్రయత్నించినా సరిగా స్పందించలేదన్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారం తర్వాత వార్షిక కౌలును త్వరగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు సీఎస్ హామీ ఇచ్చారు.

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన గుంటూరు నగర మాజీ మేయర్, సత్తెనపల్లి నియోజకవర్గ యువ నాయకుడు కన్నా నాగరాజు

శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు

ఎన్నుకోనున్న కూటమి ఎమ్మెల్యేలు

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన కూటమి

మొత్తం 175 స్థానాలకు 164 స్థానాలు గెలిచిన కూటమి

జూన్ 12న ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం

నేడు గవర్నర్‌కు లేఖ అందించనున్న కూటమి ఎమ్మెల్యేలు

విజయవాడ: ఏపీలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి చరిత్రలో నిలిచిపోయే విజయం సాధించడం తెలిసిందే. ఏపీలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 175 కాగా... కూటమి ప్రభంజనం సృష్టిస్తూ ఏకంగా 164 స్థానాల్లో జయభేరి మోగించింది. టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 స్థానాల్లో గెలిచాయి. ఈ నేపథ్యంలో, టీడీపీ అధినేత చంద్రబాబు జూన్ 12న ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీనికి ముందుగా, జూన్ 11 చంద్రబాబును కూటమి ఎమ్మెల్యేలు శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోనున్నారు. కూటమి తరపున గెలిచిన 164 మంది ఎమ్మెల్యేలు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్ లో సమావేశం కానున్నారు.

ఈ కీలక భేటీ ఉదయం 9.30 గంటలకు జరగనుంది. చంద్రబాబును కూటమి నేతగా ఎన్నుకున్న అనంతరం... ఎమ్మెల్యేలు ఆ మేరకు గవర్నర్‌కు లేఖ అందజేయనున్నారు. ఈ లాంఛనం ముగిసిన అనంతరం, ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చంద్రబాబును గవర్నర్ కోరనున్నారు.

కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు

హోంమంత్రి	–	అమిత్‌షా
రక్షణమంత్రి	–	రాజ్‌నాథ్ సింగ్
విదేశాంగమంత్రి	–	జె శంకర్
రవాణాశాఖ	–	నితిన్ గడ్కరీ
ఆర్థికమంత్రి	–	నిర్మలాసీతారామన్
వైద్యశాఖ	–	జేపీ నడ్డా
విద్యాశాఖ	–	ధర్మేంద్ర ప్రధాన్
వాణిజ్యం	–	పీయూష్ గోయల్
పార్లమెంట్ వ్యవహారాలు	–	కిరణ్ రిజిజు
పౌర విమానయానశాఖ	–	రామ్మోహన్ నాయుడు
జలశక్తి	–	సీఆర్ పాటిల్
క్రీడలు	–	చిరాగ్ పాశ్వాన్
ఓడరేవులు, షిప్పింగ్	–	శర్బానంద సోనోవాల్
మహిళాశిశు సంక్షేమం	–	అన్నపూర్ణాదేవి
మైనార్టీ శాఖ	–	రన్వీత్‌సింగ్ బిట్టూ
కార్మికశాఖ, క్రీడలు	–	మన్‌సుఖ్ మాండవీయ
పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం	–	మనోహర్‌లాల్ ఖట్టర్
పెట్రోలియం శాఖ	–	హర్దీప్‌సింగ్ పూరి
రైల్వే, సమాచార ప్రసారశాఖ	–	అశ్విని వైష్ణవ్
చిన్న, మధ్యతరహా పరిశ్రమలు	–	జితిన్ రామ్ మాంరీ%ఘ
వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధి,		
పంచాయతీరాజ్ శాఖ	–	శివరాజ్‌సింగ్ చౌహాన్
టూరిజం, సాంస్కృతిక శాఖ	–	గజేంద్రసింగ్ షెకావత్
పర్యావరణశాఖ	–	భూపేంద్రయాదవ్
విద్యుత్ శాఖ	–	శ్రీపాదనాయక్
హౌసింగ్ అండ్ అర్బన్	–	మనోహర్‌లాల్ కట్టర్
వ్యవసాయశాఖ సహాయ మంత్రి	–	పెమ్మసాని చంద్రశేఖర్
రోడ్డు రవాణా శాఖ సహాయమంత్రి	–	హర్ష్ మల్హోత్రా
చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సహాయమంత్రి	–	శోభ కరంద్లాజే
సాంస్కృతిక శాఖ, పర్యాటక సహాయమంత్రి	–	రావు ఇంద్రజిత్ సింగ్
టూరిజం శాఖ సహాయమంత్రి	–	సురేష్‌గోపి

అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలి

36 గ్యాలరీల ఇన్‌చార్జుల విధులు అత్యంత కీలకమైనవి

అతిథులకు సేవల్లో ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలి

ప్రమాణస్వీకార ఏర్పాట్లపై ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్ సమీక్ష

గన్నవరం: కేసరపల్లి గ్రామంలోని ఐటీ పార్క్ సమీపంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేయనున్నారని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు పటిష్ట సమన్వయంతో వ్యవహరిం చాలని కార్యక్రమ ప్రత్యేక అధికారి జి.వీర పాండ్యన్ సూచించారు. సోమవారం కార్యక్రమ ప్రాంగణంలో కార్యక్రమ సమన్వయ ఉన్నతా ధికారులతో కలిసి గ్యాలరీల ఇన్‌చార్జిలతో ఆయన చర్చించారు. విధుల నిర్వహణకు సంబంధించి స్పష్టమైన మార్గనిర్దేశనం చేశారు. మూడు కేటగిరీల్లో మొత్తం 36 గ్యాలరీలు ఉంటాయని.. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు, న్యాయ మూర్తులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రత్యేక అతిథులు, వీవీఐపీలు, వీఐపీలు, మీడియా ప్రతినిధులు తదితరులకు సంబంధించిన గ్యాలరీల విధుల నిర్వహణ లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం అతిథులకు సేవలు అందించాలని సూచించారు. ప్రతి గ్యాలరీకి వాటర్ టీం, శానిటేషన్ టీం, మెడికల్ టీం ఉంటాయని తెలిపారు. ఈ బృందాల సభ్యులతో గ్యాలరీల ఇన్‌చార్జులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు గ్యాలరీలకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారని వివరించారు.

ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రధాన మంత్రి కూడా కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో ఎస్పీజీ భద్రత ఉంటుందని, అందువల్ల భద్రతా మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరిం చాలని సూచించారు.

కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు ఆయా గ్యాలరీల్లో సరైన విధంగా ఆశీనులు అయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ సమా వేశంలో వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, మునిసి పల్ కమిషనర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | మంగళవారం 11, జూన్ 2024

నందమూరి నాలుగో తరాన్ని పరిచయం చేసే అవకాశం రావడం

గొప్ప భాగ్యం: వైవిఎస్ చౌదరి

నందమూరి జానకి రామ్ తనయుడు నందమూరి తారక రామారావును హీరోగా పరిచయం చేస్తున్న డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి- న్యూ టాలెంట్ రోర్స్ ఏ బ్యానర్‌పై సినిమాని నిర్మిస్తున్న యలమంచిలి గీత తెలుగు చిత్రసీమలో విశిష్టమైన నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ, లెజెండరీ శ్రీ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత శ్రీ జానకిరామ్ తనయుడు యంగ్ చాప్ నందమూరి తారక రామారావు ఫిలిమ్స్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి దర్శకత్వం వహిస్తున్న ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌ని "న్యూ టాలెంట్ రోర్స్ ఏ" బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. రమేష్ అత్తిలి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. నందమూరి తారక రామారావు ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకొని, హీరోగా ఎదగడానికి కావాల్సిన స్కిల్స్ అన్నీ నేర్చుకున్నారు. తన అద్భుతమైన కెరీర్‌లో ఎందరో నటీనటులను పరిచయం చేసిన వైవిఎస్ చౌదరి తన కమ్‌బ్యాక్ మూవీతో నందమూరి తారక రామారావును లాంచ్ చేసే బాధ్యతను తీసుకున్నారు. డైరెక్టర్ వైవిఎస్ చౌదరికి నందమూరి హీరోలతో గొప్ప అనుబంధం వుంది. ఆయన హరికృష్ణ, బాలకృష్ణతో సినిమాలు చేశారు. ఇప్పుడు నందమూరి తారక రామారావుని పరిచయం చేస్తున్నారు. నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని అనౌన్స్ చేశారు.

డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మాట్లాడుతూ.. సభకు నమస్కారం. ఈ రోజు మీ అందరిముందు నిల్చోగలిగానంటే అది నా దైవంగా భావించే నందమూరి తారకరామారావు గారి దివ్య మోహన రూపం చలువ. ఆయన దివ్య మోహన రూపం నన్ను సినిమాల వైపు నడిపించింది. పరిశ్రమలోకి వచ్చిన తర్వాత అసిస్టెంట్‌గా, అసోసియేట్‌గా, కో డైరెక్టర్‌గా, డైరెక్టర్, నిర్మాతగా ఇలా అంచెలంచెలుగా ఎదుగుతూ ఎన్ని శాఖలు నిర్వహించిన కూడా ఇప్పటికీ నేను ఎన్టీఆర్ వీర అభిమానిని అని చెప్పుకోవడంలో నాకు ఆనందం వుంటుంది.

జూన్ 15న 'సరిపోదా శనివారం'

ఫస్ట్ సింగిల్

నేచురల్ స్టార్ నాని తన అప్ కమింగ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోద శనివారం'లో సూర్య పాత్రలో మునుపెన్నడూ చూడని ఇంటెన్స్ పవర్-ప్యాక్డ్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ అడ్రినలిన్‌తో కూడిన యానిక్ అడ్వంచర్ ని భారీ కాన్వాస్‌పై హై బడ్జెట్‌తో డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మూవీ టీం మ్యూజిక్ ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేసింది. సరిపోదా శనివారం ఫస్ట్ సింగిల్ జూన్ 15 రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. జేక్స్ బిజోయ్ ఈ సినిమా కోసం అద్భుతమైన ఆల్బమ్ కంపోజ్ చేశారు. మేకర్స్ రిలీజ్ చేసిన అనౌన్స్ మెంట్ వీడియోలో నాని స్లో మోషన్‌లో నడుచుకుంటూ వచ్చి క్లాత్ ని తొలగించాక టేప్ రికార్డ్ రివిల్ కావడం, పవర్ ప్యాక్డ్ మ్యూజిక్ వినిపించడం చాలా క్రియేటివ్, ఇంట్రస్టింగ్ గా వుంది.

ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. మురళి జి డివోపీగా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్. ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్టు 29, 2024న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

'యుఫోరియా' చిత్రానికి సంగీత దర్శకుడిగా కాల భైరవ

కాల భైరవ.. భారతదేశానికి ఆస్కార్ సాధించి పెట్టిన 'నాటు నాటు ..' పాటను పాడి ఆస్కార్ వేదికను ఓ ఊపు ఊపారు. ఆయన ఓ వైపు సింగర్‌గా, మరో వైపు మ్యూజిక్ డైరెక్టర్‌గా రాణిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ యంగ్ మ్యూజికల్ సెన్సేషన్ ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆ క్రేజీ సినిమాయే 'యుఫోరియా'. వైవిధ్యమైన సినిమాలు, భారీ చిత్రాలను తెరకెక్కించటంలో సెన్సేషనల్ డైరెక్టర్ గుణశేఖర్ డైరెక్షన్‌లో 'యుఫోరియా' అనే యూత్‌ఫుల్ సోషల్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే.

'యుఫోరియా'కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా కాలభైరవ టీమ్‌తో జాయిన్ అవుతున్నారంటూ ఓ స్పెషల్ వీడియో ద్వారా అనౌన్స్ చేసింది. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మాతగా ఈ చిత్రం రూపొందనుంది. ఈసినిమాలో నటించబోయే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులకు సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తామని టీమ్ తెలియజేసింది.

సీతా కళ్యాణ వైభోగమే

థియేటర్లో చూసి ఆదరించండి..

సుమన్ తేజ్, గరీమ చౌహాన్ హీరో హీరోయిన్లుగా డ్రీమ్ గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించిన చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'. ఈ సినిమాను జూన్ 21న విడుదల చేయబోతున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను బలగం నిర్మాత హర్షిత్ రెడ్డి విడుదల చేశారు. సోమవారం నాడు నిర్వహించిన ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ..లి 'ఓ మై ఫ్రెండ్ టైంలోనే సతీష్‌తో పరిచయం ఏర్పడింది. ఈ మూవీ ఐడియాను ఏడాదిన్నర క్రితమే చెప్పాడు. సుమన్ అనే కొత్త కుర్రాడు, యంగ్ టాలెంట్‌తో చేస్తున్నానని అన్నాడు. సుమన్ ఫస్ట్ ఫిల్మ్, సతీష్ రెండో చిత్రానికి ఆల్ ది బెస్ట్. నీరూస్ సంస్థకు ఆల్ ది బెస్ట్. రాచాల యుగంధర్‌కు ఆల్ ది బెస్ట్. జూన్ 21న ఈ చిత్రం రాబోతోంది. అందరూ థియేటర్లో చూడండి' అని అన్నారు. దర్శకుడు సతీష్ పరమవేద మాట్లాడుతూ..లి 'మా సినిమా పాటలు టీ-సీరిస్ ద్వారా రిలీజ్ అయ్యాయి. మా ట్రైలర్ అందరికీ నచ్చింది. హర్షిత్ రెడ్డి గారు బలగం సినిమాతో బలాన్ని ఇచ్చారు. హర్షిత్ రెడ్డి గారి కజిన్ సుమన్ తేజ్ ఈ సినిమాతో పరిచయం కాబోతున్నారు. చరణ్ అర్జున్ గారు మంచి పాటలు ఇచ్చారు. నిర్మాత యుగంధర్ గారికి సినిమా మీద ఎంతో ప్యాషన్ ఉంది. రాముడి గుడి లేని ఊరు ఉండదు. ఆయన బతికిన విధానం వల్లే అందరికీ గుర్తుండిపోయారు. కుటుంబ సమేతంగా చూసేలా ఈ సినిమాను తీశాను. నీరూస్ సంస్థ వల్లే ఈ సినిమా ఇక్కడి వరకు వచ్చింది. ఈ చిత్రం కోసం యూనిట్‌లోని ప్రతీ ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. జూన్ 21న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు.

'మహారాజ'ని తెలుగు ఆడియన్స్ డెఫినెట్‌గా ఇష్టపడతారు

-విజయ్‌సేతుపతి

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి మోస్ట్ ప్రెస్టీజియస్ 50వ మైల్ స్టోన్ మూవీ 'మహారాజ'రిలీజ్ కి రెడీ అయ్యింది. నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో ప్యాషన్ స్టూడియోస్, ది రూట్ బ్యానర్స్ పై సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. అనురాగ్ కశ్యప్ పవర్ ఫుల్ రోల్ లో నటించారు. విజయ్ సేతుపతికి ఇది 50వ సినిమా కావడంతో మెమరబుల్ హిట్ అందించడం కోసం దర్శకుడు చాలా కేర్ తీసుకున్నాడు. నిర్మాతలు ఈ ప్రాజెక్ట్‌ని హ్యూజ్ బడ్జెట్ తో లావిష్ గా నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేశాయి. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ హౌస్ ఎన్‌విఆర్ సినిమా ఈ మూవీని ఏపీ, తెలంగాణలలో మ్యాసీవ్‌గా రిలీజ్ చేయనుంది. ఈ సినిమా జూన్ 14న థియేట్రికల్ రిలీజ్ కానున్న నేపథ్యంలో గ్రాండ్ గా ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

ప్రీరిలీజ్ ప్రెస్ మీట్‌లో హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ముందుగా రామోజీ రావు గారికి అంజలి ఘటిస్తున్నాను. ఆయన మృతి ఎంతో బాధకలిగించింది. హైదరాబాద్‌తో కంటే రామోజీ ఫిల్మ్‌సిటీ తోనే నాకు మోమోరిస్ ఉన్నాయి. 2005లో ధనుష్ సినిమా కోసం తొలిసారి ఫిల్మ్‌సిటీకి వెళ్లాను. సినిమాకు సంబంధించి ఏం కావాలో అవన్నీ ఫిల్మ్‌సిటీలో కనిపించడం చూసి స్టన్ అయిపోయాను. ఎన్నో సంవత్సరాలుగా ఎంతోమంది దర్శకులు మంచి సినిమాలు తీస్తున్నారంటే అందులోని సదుపాయాలే కారణం. రామోజీరావు గారి విజన్‌కు ఫిల్మ్‌సిటీనే నిదర్శనం. సినిమా పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు.

విజయ్‌తో చేయాలని తీరని కోరిక

సాధారణంగా సినిమా ఇండస్ట్రీలో ఉన్న హీరోలకు, హీరోయిన్స్ కి ఇతర టెక్నీషియన్స్ అందరికి డ్రీమ్ రోల్ లేదా డ్రీమ్ ప్రాజెక్ట్ ఉంటుంది. చాలా మంది డ్రీమ్ రోల్ చేయలేరు, చాలా మంది టెక్నీషియన్స్ డ్రీమ్ ప్రాజెక్ట్ చేయకుండానే కెరీర్ ను ముగించిన సందర్భాలు ఉన్నాయి అనేది ఇండస్ట్రీ వర్గాల మాట. ఇప్పుడు అనన్య పాండే గురించిన ఆసక్తికర చర్చ జరుగుతుంది. బాలీవుడ్ స్టార్ కిడ్ అయిన ఈ అమ్మడు తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు దక్కించుకుంది. హీరోయిన్‌గా తెలుగులో లైగర్ చేసి ఫ్లాప్ అయినా కూడా బాలీవుడ్ లో మాత్రం ఈ అమ్మడికి మంచి ఆఫర్లు వస్తూనే ఉండటం విశేషం. తాజాగా ఒక జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ తనకు తమిళ హీరో విజయ్‌తో కలిసి నటించాలనే కోరిక ఉందంటూ చెప్పు కొచ్చింది. ప్రస్తుతం గోట్ సినిమాను వెంకట్ ప్రభు దర్శ కత్వంలో చేస్తున్న విజయ్ ఇటీవల తన రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటించిన విషయం తెల్సిందే. అలాంటి విజయ్‌తో సినిమా చేయాలని అనుకోవడం, అదే తన డ్రీమ్ రోల్ అంటూ అనన్య పాండే చెప్పడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయాలతో బిజీ అవ్వబోతున్న విజయ్ సినిమాలు ముందు ముందు చేయడం అనుమానంగానే ఉంది. కనుక అనన్య పాండే కోరిక తీరక పోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అనన్య పాండే లైగర్ సినిమాలో చేసిన పాత్రకు మంచి స్పందన వచ్చింది.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
8
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, జూన్ 2024

వైసీపీకి మేయర్ దంపతుల రాజీనామా

నెల్లూరు,మహానాడు: వైసీపీకి నెల్లూరులో బిగ్ షాక్ తగిలింది. నెల్లూరు మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. తామంతా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంట నడుస్తామని ప్రకటించారు. తమకు శ్రీధర్ రెడ్డి వల్లే మేయర్ పదవి వచ్చిందని, అధికార పార్టీ బెదిరింపుల వల్లే అప్పుడు పార్టీని వీడామని తెలిపారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా శ్రీధర్‌రెడ్డి తనకు కార్పొరేటర్ టికెట్ ఇచ్చారని వివరించారు.

ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల వేదిక అధ్యక్షుడిగా గరికిముక్కు సుబ్బయ్య

అమరావతి,మహానాడు: ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా గరికిముక్కు సుబ్బయ్యను నియమించినట్లు సామాజిక సమరసత వేదిక అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయనను నియమిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందరికీ సమానమైన అత్యధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొటుకుల జాషువాను నియమించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారికి వేదిక గౌరవ అధ్యక్షుడు పరుశరామ్(ఐఏఎస్), విష్టువు, కె.మన్మథరావు అభినందనలు తెలిపారు.

పేలిన కెమికల్ ట్యాంకర్

హైదరాబాద్: దుండిగల్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఖాజిపల్లి చౌరస్తాలో ఓ వెల్డింగ్ షెడ్‌లో కెమికల్ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలింది. దాంతో

చుట్టుపక్కల ఉన్న పలు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. వెల్డింగ్ చేస్తున్న వ్యక్తికి తీవ్రగాయాల య్యాయి. క్షతగాత్రుడిని సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. దుండిగల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఐప్యాక్ టీం మోసం చేసింది..

తిరువూరు వైసీపీ అభ్యర్థి స్వామిదాస్

తిరువూరు,మహానాడు:

ఆరా మస్తాన్ అడ్డంగా ముంచేశాడని తిరువూరు వైసీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాస్ మండిపడ్డారు. తిరువూరు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఆర్థికంగా దెబ్బతిన్నాం.. కొన్ని పొరపాట్లు జరిగాయి..ఐప్యాడ్ టీం మోసం చేసింది.. ఆరా మస్తాన్ అడ్డంగా ముంచేశా దని ఆవేదన వెళ్లగక్కారు.

రాజకీయాలకు కేశినేని నాని బై బై

అమరావతి: విజయవాడ వైసీపీ ఎంపీగా పోటీ చేసి సోదరుడి చేతిలో పరాజయం పాలైన కేశినేని నాని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి

తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఆయన టీడీపీ ఎంపీగా కొనసాగుతూ వైసీపీలోకి వెళ్లిన విషయం తెలిసిందే. కొంచెం ఒద్దికగా ఉండి టీడీపీని అంటి పెట్టుకుని ఉండి ఉంటే అవకాశాలు దక్కేవని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రమంత్రి అవ్వాల్సిన వ్యక్తి నేడు కేవలం ఒక అనామకుడిగా మిగిలిపోయారు. రాజకీయాలలో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయి అనటానికి మరో నిదర్శనమని అంటున్నారు.

స్వరూపానంద కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి

- విశాఖ నకిలీ స్వామిని తక్షణమే అరెస్టు చేయాలి
- తిరుమల, దేవాదాయ శాఖను భ్రష్టు పట్టించాడు
- రాజశ్యామల యాగం పేరుతో ప్యాకేజీలు
- నీ యాగాలు ఫలిస్తే ఇద్దరు సీఎంలు ఎందుకు ఓడారు?
- ఏ ఎండకాగొడుగు పట్టే ఊసరవెల్లి
- ఈరోజు చంద్రబాబుపై ప్రేమ పుట్టిందా?
- స్వామీజీ అవతారం ఎత్తక ముందు ఆయన చరిత్ర ఇది
- జగదాంబ థియేటర్‌లో బ్లాక్ టిక్కెట్లు అమ్మేవాడు
- శారదా పీఠం నకిలీ పీఠం..దాని ముసుగులో వసూళ్లు
- బ్రాహ్మణ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ

అమరావతి,మహానాడు: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి ధోరణి చూస్తుంటే ఏ ఎండ కా గొడుగు పట్టేలా ఆయన ప్రకటన ఉందని, దేశంలో ఊసరవెల్లులు కూడా ఆయనను చూసి సిగ్గుపడతారని బ్రాహ్మణ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ ధ్వజమెత్తారు. ఈ దేశంలో నాలుగు పీఠాలు మాత్రమే ఆదిశంకరాచార్యులు ప్రతిష్ట చేశారు. అయితే విశాఖలో ఉన్న శారదాపీఠం ఒక నకిలీ పీఠం అని, ఆయన ఒక నకిలీ స్వామీజీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో స్వామీజీ వేషం ఎత్తకముందు స్వరూపానంద జగదాంబ థియేటర్‌లో బ్లాక్ టికెట్లు అమ్మేవాడని, మద్యం తాగి ఎక్కడబడితే అక్కడ పడిపోయేవాడని తెలిపారు. చిన్నగా కాషాయం తొడుక్కుని ఆధ్యాత్మిక వ్యాపారం ప్రారంభించాడని, ఆయన దగ్గర

ఎటువంటి మహిమలు లేవన్నారు. కానీ, కొంతమంది జనం, రాజకీయ నాయకులు ఆయనను నమ్మి అధ: పాతాళంలోకి తోసి వేయబ డ్డారన్నారు. అందులో జగన్ ఒకడని, రెడ్డికి ఎప్పటికీ రాజకీయ భవిష్యత్తు లేకుండా రాజ శ్యామల యాగాలు చేశాడని, అమ్మవారు కూడా స్వరూపానంద కు తగిరీతిలో శిక్ష విధించబోతుందని అన్నారు. రాజశ్యామల యాగం పేరుతో తెలుగు రాష్ట్రాల నేతలను ముఖ్యమంత్రి చేస్తానని ప్యాకేజీ మాట్లాడుకుంటారని, యాగాలు ఫలించినట్లయితే ఇరు తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు మాజీలు ఎందుకయ్యారని ప్రశ్నించారు. వైసీపీకి స్వామీజీ జగన్ బాకాలాగా మారడాన్ని, జగన్‌కు ముద్దులు పెట్టడాన్ని ఏమనాలని ప్రశ్నించారు.

టీటీడీలో అక్రమాలపై నోరుమెదపలేదేం

జగన్ ప్రభుత్వానికి రాజ గురువు లాగా వ్యవహరించి టీటీడీలో అరాచకాలు, అక్రమాలు జరుగుతుంటే ఒక్కరోజు కూడా నోరు తెరిచిన పాపాన పోలేదని, దేవాదాయ శాఖలో అవినీతి విపరీతంగా జరుగుతుంటే కనీసం మాట్లాడిన దాఖలాలు కూడా లేవు. దేవాదాయశాఖ అర్చకులపై దాడులు జరుగుతుంటే ఒక్క సంఘటనను సాము లోరు ఖండిరచలేదు. రాముని విగ్రహం తల నరికినప్పుడు, రథం తగల పడ్డప్పుడు, దుర్గ గుడిలో వెండి సింహాలు మాయ మైతే స్వామీజీ ఎందుకు పట్టిం చుకోలేదని ప్రశ్నించారు. విశాఖ శారదా పీఠం ఆధ్వర్యంలో కమిషన్ వసూలు చేసుకునే సంస్కృతి మీది కాదా స్వామీజీ, దేవాదా య శాఖ అధికారుల పైరవీలు, కలెక్షన్స్, పైరవీలు మీ పీఠంలో మొన్నటిదాకా తమరు చేయలేదా స్వామీజీ అని ప్రశ్నించారు. ఈ రోజు ప్రజలు జగన్ ప్రభు త్వాన్ని తిరస్కరిస్తే ఇప్పటికిప్పుడు చంద్రబాబు ప్రేమ ఒలకబోసి ఆశీర్వాదాలు దేనికి చెబుతున్నారో ఈ నకిలీ స్వామీజీ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వామి స్వరూపానంద విశాఖ పీఠం వదిలేసి హైద్రాబాద్, రుషికేశ్ ఎందుకు వెళుతున్నారో చెప్పాలని, విశాఖ పీఠాధిపతి భూ అక్రమాలపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆ భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, పీఠం పేరుతో నేరాలు, ఘోరాలు చేసిన ఈ నకిలీ స్వాములోరుని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144